క్లుప్తంగా

నాగేంద్రస్వామికి పూజలు

గీసుకొండ : మండలంలోని ఊకల్ హవేలీలోని నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి సముద్రాల సుదర్శనాచార్యులు అర్చన, అభిషేకాలు తదితర కార్యక్రమాలు చేపట్టగా భక్తులు పాల్గొని మొక్కుకున్నారు. స్వామి వారి విగ్రహాన్ని మల్లె పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

బెంచీల బహూకరణ



వర్ధన్నపేట : మండలంలోని ల్యాబర్తిలోని ప్రభుత్వ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి, భారతి విద్యా భవన్ విద్యాసంస్థల అధినేత తక్కలపల్లి బుచ్చిబాబు మంగళవారం సుమారు రూ.లక్ష విలువైన 21 డ్యూయల్ డెస్క్ బెంచీలు బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు.

డైరీల..

మండలంలోని ఇల్లంద జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు హెచ్‌ఎం విజయ, ఉపాధ్యాయులు సొంత డబ్బుతో సమకూర్చిన 150 డైరీలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ఇచ్చే హోమ్ వర్క్ డైరీలో రాసుకుని తల్లిదండ్రుల పర్యవేక్షణలో విద్యార్థులు చదువుకునేలా డైరీలు ఉపకరిస్తాయని హెచ్‌ఎం చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, మమత, సుజాత, శ్రీనివాసరావు, సీతారాంరెడ్డి, హసన్ అలీ, మాధవి, ఉమాదేవి, శోభారాణి, భవానీ, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్..



గీసుకొండ : మండలంలోని మనుగొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిర్మల బైండింగ్ వర్క్స్ అధినేత, మరియపురం మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి 1200 నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయగిరి ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నల్లబెల్లి : మండలంలోని నాగరాజుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాకం విష్ణు కేయూలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఎంపీఓ పసరగొండ రవి ఆధ్వర్యంలో మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ రఘువరన్, ఉద్యోగులు రజనీకాంత్‌రెడ్డి, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం కమిటీ ఎన్నిక



నర్సంపేట : పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌లోని రజక కమ్యూనిటీ హాల్‌లో రజక సంఘం పట్టణ కమిటీని మాజీ డివిజన్ అధ్యక్షుడు రాయరాకుల సారంగం ఆధ్వర్యంలో పట్టణ మాజీ అధ్యక్షుడు ఐలోని శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొల్లూరి లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శిగా తడిగొప్పుల రమేశ్, కోశాధికారిగా కొల్లూరి రాము, ఉపాధ్యక్షుడుగా నెల్లుట్ల సాంబయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, నాయకులు కొల్లూరి భాస్కర్, రాయరాకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కుల పెద్దమనిషిగా..



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని జల్లితండాలో కొర్ర కుల పెద్దమనిషిగా చిన్న మోహన్ ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన్ను కులస్తులు ఎన్నుకున్నారు. అనంతరం మోహన్ మాట్లాడారు. తనను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సోమ్లా, హరిసింగ్, రాము, దేవ్లా, జాత్రు, స్వామి, మోహన్, శ్రీను, బాబు, భద్రు, ఛత్రు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్‌రావు తండ్రి ఆగారావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మంత్రి సీతక్క మంగళవారం పరామర్శించారు. ఆగారావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్ది శ్రీనివాస్, అచ్యుతం, వెంకటేశ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీతో బెంబేలు

● చిరువర్షానికే మూడు ఫీట్లకుపైగా వరదనీరు

సంగెం : మండలంలోని చింతలపల్లి వద్ద ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ ఎత్తివేసి గతేడాది నిర్మించిన ఆర్‌యూబీ నుంచి రాకపోకలు సాగించాలంటే వాహనచోదకులతోపాటు ఎల్గూర్ రంగంపేట ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వరంగల్–విజయవాడ మధ్య చింతలపల్లి వద్ద లెవల్ క్రాసింగ్ గేట్ తొలగించి గతేడాది ఆర్‌యూబీ నిర్మించిన విషయం తెలిసిందే. వరదనీరు, ఊటనీరు వెళ్లే మార్గం లేకపోవడంతో వర్షాకాలం ఆర్‌యూబీలో భారీగా నీరు నిలుస్తుండడంతో ఆర్‌యూబీ లెవల్ కంటే కిందకు బావి నిర్మించారు. నీరు వెళ్లేలా ఆర్‌యూబీ నుంచి తొమ్మిది మోరీల వరకు సైడ్ కాల్వ సైతం నిర్మించారు. బావిలోని నీటిని మోటార్ ద్వారా పంపింగ్ చేసి సైడ్‌కాల్వ ద్వారా తొమ్మిది మోరీల వరకు వెళ్లడంతో ఆర్‌యూబీలో నీరు నిలవకుండా చర్యలు చేపట్టారు. వర్షాకాలం ముగిశాక కొంత కాలం పాటు రైల్వే అధికారులు మోటార్ ద్వారా నీటిని పంపింగ్ చేసినా వేసవిలో నీటిఊట తగ్గడంతో పంపింగ్ నిలిపేశారు. తాజాగా కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో నీటిఊటలు, వర్షపునీటితో బావి నిండి నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఆర్‌యూబీలో మూడు ఫీట్లకు పైగా నిలుస్తున్న దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఎల్గూర్ రంగంపేటతోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆర్‌యూబీ నుంచి ప్రయాణం సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సైలెన్సర్లలోకి వరదనీరు వెళ్తుండడంతో బైక్‌లు, ఆటోలు మరమ్మతులకు గురవుతున్నాయి. చిరువర్షానికే ఇబ్బంది తలెత్తితే భారీ వర్షాల సందర్భాల్లో ఎలా? అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రైల్వే శాఖ అధికారులు స్పందించి బావిలోని నీటిని ఎప్పటికప్పుడు మోటార్ ద్వారా పంపింగ్ చేసి ఆర్‌యూబీలో నీరు నిల్వకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్‌యూబీలో నిలిచిన నీటిలోంచి వెళ్తున్న ప్రజలు

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

● ఆర్‌డీఓ నారాయణ

గీసుకొండ : ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియగా పరకాల ఆర్‌డీఓ కన్నం నారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో పరకాల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల జాబితా, ఎన్నికల నియమావళిపై బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌ఓ) మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఓటర్ల తొలగింపు విషయంలో ఎన్నికల నియమావళి పాటించాలని చెప్పారు. నూతన ఓటర్ల నమోదు, బదిలీ, సవరణలపై ట్రెయినర్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్‌రావు, ఆర్‌ఐలు సాంబయ్య, శ్రీధర్, ట్రెయినర్లు సూర్యప్రకాశ్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ : మాట్లాడుతున్న ఆర్‌డీఓ నారాయణ

రాయపర్తి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ ముల్కనూరి శ్రీనివాస్ మాట్లాడారు. అసెంబ్లీ కాన్‌స్టిట్యూయెన్సీ లెవెల్ మాస్టర్ ట్రెనర్ శేషగిరిరావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు చంద్రమోహన్, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శంకర్

● జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శంకర్

నర్సంపేట : మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) కొల్లూరి శంకర్ కోరారు. చెన్నారావుపేటలోని ఆశాజ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఇందిర మహిళా శక్తి సంబురాలకు ఆయన హాజరై మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. హరితహారం వంటి కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందించనుండడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మహిళలకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఇందిర మహిళా శక్తి సంబురాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నల్ల శ్రీవాణి, మండల వైద్యాధికారి సరోజ, ఏపీఎం ముక్కెర ఈశ్వర్, వస్కుల ప్రేమ్‌రాజ్, కార్యదర్శి మాధవి, కోశాధికారి కవిత, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు కట్టయ్య, మాణిక్యం, శ్రీలత, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీత్లా భవానీ పండుగ



దుగ్గొండి: పీజీ తండాలో సీత్లా భవానీ మాతకు పూజ చేస్తున్న యువతులు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, ఖానాపురం, పర్వతగిరి, సంగెం, రాయపర్తి, తదితర మండలాల్లో గిరిజనులు మంగళవారం ఘనంగా సీత్లా భవానీ పండుగ నిర్వహించారు. గిరిజనులు డప్పుచప్పుళ్లతో ర్యాలీగా వెళ్లి సీత్లా భవానీ మాతకు మొక్కులు చెల్లించారు. పశువులు దాటించే కార్యక్రమం నిర్వహించారు. గొర్రెలను, కోళ్లను బలి ఇచ్చారు. తండాల్లో సందడి నెలకొంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

● బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నర్సింహనాయక్

రాయపర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి సత్తాచాటాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి కోరారు. మండలంలోని మొరిపిరాలలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చేగూరి మల్లేశ్, మాజీ సర్పంచ్ అనిరెడ్డి యాకూబ్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, నాయకులు బద్దం వేణుగోపాల్‌రెడ్డి, వేముల రమేశ్, నాగపురి సోమయ్య, ఎల్లస్వామి, సాయి, జీవన్, దోమల నవీన్, ఏనుగు కుమార్, బొమ్మెరబోయిన మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులే ధ్యేయం



నర్సంపేట : కార్మికుల హక్కుల పరిరక్షణే సీఐటీయూ ధ్యేయమని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి తెలిపారు. నల్లబెల్లి మండలంలోని పలువురు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆ యూనియన్‌లో మంగళవారం చేరగా వారికి ఆమె ఆహ్వానం పలికి మాట్లాడారు. కార్మికులను హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడాలని చెప్పారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమరశీల పోరాటాలు నిర్మిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు హన్మకొండ శ్రీధర్, నాయకులు జాటోతు సుజాత, పిన్నింటి రజిత, ఉదయ, జమున, భాగ్యమ్మ, సుమలత, కల్పన, శీలాబాయి, అస్మత్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక పూజలు

నల్లబెల్లి : రేపు (ఈనెల 10న) మండలంలోని మేడపల్లి, రాంపూర్ గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు శివశక్తి పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాంబరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.25 గంటలకు పూజలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. స్వామి వారికి 108 కలశములతో అభిషేకాలు నిర్వహించనున్నట్టు వివరించారు.

కాల్వపై నిర్మాణాన్ని ఆపాలి

దుగ్గొండి : మండలంలోని లక్ష్మీపురం గ్రామ పరిధిలోని రాతిమాటు కుడికాల్వపై చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఆపాలని ఆయకట్టు రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పలువురు రైతులు తహసీల్దార్ రాజేశ్వర్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. అనంతరం రైతులు మాట్లాడారు. జెరిపోతుల వాగు రాతిమాటు కుడికాల్వ కింద సుమారు 100 ఎకరాల ఆయకట్టు ఉండగా ఓ కబ్జాదారు కాల్వను ఆక్రమించి నిర్మాణం చేపట్టాడని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మామునూరి సుమన్, మాజీ సర్పంచ్ బొమ్మగాని రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పొలంబాట

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాల గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఈ గౌతమ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఈ ఆనందం ఏఈ ఆపరేషన్ తరుణ్, లైన్‌మైన్ లక్ష్మణ్, సుమన్, జేఎల్‌ఎం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాస్తారోకో

వర్ధన్నపేట : పట్టణంలోని ఎస్‌బీఐ నుంచి పెట్రోల్ పంప్ మధ్య మురికి కాల్వ నిర్మించాలని డిమాండ్ చేస్తూ వరంగల్–ఖమ్మం రహదారిపై స్థానికులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఎస్‌బీఐ నుంచి పెట్రోల్ పంప్ వరకు మురుగు కాల్వ లేకపోవడంతో వర్షపు నీరు, మురుగు రోడ్డు మీదకు చేరి దుర్వాసన వెదజల్లుతుందని, రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ స్పందించి కాల్వ నిర్మాణ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోగా పోలీసులు చేరుకుని ఆందోళనకారులను నచ్చజెప్పి పంపించారు.

‘పెన్షన్‌పై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సరికాదు’

నెక్కొండ : పెన్షన్ పెంపును, కరువుభత్యాన్ని నిలిపివేస్తే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు గటిక మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని సంఘం భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పెన్షనర్ల హక్కులకు భంగం కలిగిస్తోందని చెప్పారు. విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ పెంపు, కరువు భత్యం ఎప్పటిలాగే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి వడ్డె లక్ష్మినారాయణ, నాయకులు ఇనుగాల ఉపేందర్‌రెడ్డి, ఈదునూరి యాకయ్య, పాగాకుల సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



జనార్దన్

సంగెం : భార్యతో గొడవపడ్డ ఓ వ్యక్తి ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన ముప్పు జనార్దన్‌కు సంగెం మండలం గవిచర్లకు చెందిన పుప్పాల యాకాంతంకు కూతురు మౌనికను ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కుమార్తెలు. భార్యభర్తల మధ్య గొడవల నేపథ్యంలో మూడేళ్ల నుంచి మౌనిక తల్లిగారింటి వద్ద ఉంటున్నది. 23 రోజుల క్రితం జనార్దన్ వచ్చి అత్తగారింటి వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 7వ తేదీన జనార్దన్ భార్య మౌనికతో గొడవపడి ఆమెతోపాటు నాయనమ్మను గదిలో ఉంచి గడియపెట్టి మామ బైక్ తీసుకుని వెళ్లిపోయాడు. దీంతో పుప్పాల యాకాంతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఆచూకీ తెలిస్తే పోలీస్‌స్టేషన్ 8712685029, ఎస్సై 8712685243 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఎన్నికల్లో ప్రాతినిధ్యం కల్పించాలి

నర్సంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు అడ్డా రాజు డిమాండ్ చేశారు. వేదిక డివిజన్ అధ్యక్షుడు భూక్య రాజు ఆధ్వర్యంలోని బృందం ఆర్‌డీఓ ఉమారాణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అడ్డా రాజు మాట్లాడారు. పింఛన్ కోసం వికలాంగులు దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తుండగా మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వేదిక దుగ్గొండి మండల అధ్యక్షుడు చింత కుమారస్వామి, నాయకులు శివ, తదితరులున్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఖానాపురం : నేడు (బుధవారం) తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతుకూలి సంఘం డివిజన్ కార్యదర్శి ఈరెల్లి రాంచందర్ కోరారు. మండల కేంద్రంలో సమ్మె కరపత్రాలను మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా చట్టాలను సవరించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలపై పోరాడాలని సూచించారు. సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోశయ్య, లింగన్న, రాజు, పుల్లయ్య, మల్లయ్య, శ్రీను, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : వైఎస్‌ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వైఎస్‌ఆర్ సేవలు మరువలేనివి



వర్ధన్నపేట : నివాళులర్పిస్తున్న నాయకులు



రాయపర్తి : కొండూరులో..



సంగెం : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



నల్లబెల్లి : నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు, వైఎస్ అభిమానులు తెలిపారు. జిల్లావ్యాప్తంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల కేక్‌లు కట్ చేసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు, అభిమానులు మాట్లాడారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సేవలను కొనియాడారు. ప్రజాహృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కీర్తించారు.

క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నతి



నల్లబెల్లి : మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణ



గీసుకొండ : మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్



సంగెం : మాట్లాడుతున్న ఎంఈఓ రాము

● స్ఫూర్తి కార్యక్రమాల్లో వక్తలు

సాక్షి నెట్‌వర్క్ : విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుంటేనే జీవితంలో ఉన్నతి సాధించగలరని తహసీల్దార్లు కృష్ణ, రాజ్‌కుమార్, రాజేశ్వర్‌రావు, గీసుకొండ స్పెషల్ ఆఫీసర్ సురేశ్ కుమార్, ఎంఈఓ రాము, వెంకటేశ్వర్లు, ఎంపీఓలు కొమురయ్య, శేషాంజన్ స్వామి, శ్రీధర్‌గౌడ్, ప్రముఖ వక్త రావుల భాస్కర్‌రావు స్పష్టం చేశారు. నల్లబెల్లి, గీసుకొండ, సంగెం, పర్వతగిరి, దుగ్గొండి, నెక్కొండ, రాయపర్తి మండలాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో మంగళవారం నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమాలకు వారు అతిథులుగా హాజరై మాట్లాడారు. సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని, చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ రాణించాలని, బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకునేలా ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమాల్లో డీసీసీబీ మేనేజర్ యాకూబ్ పాషా, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రణయ్‌కుమార్, హెచ్‌ఎంలు కృష్ణమూర్తి, విజయ, రామస్వామి, మల్లయ్య, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో ఆరోగ్యం కీలకం



వర్ధన్నపేట : సూచనలు ఇస్తున్న వైద్య సిబ్బంది



పర్వతగిరి : మాట్లాడుతున్న డాక్టర్ ఉదయ్‌రాజ్



సంగెం : విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

● వైద్యాధికారులు నేహా ఫాతిమా, ఉదయ్

వర్ధన్నపేట/పర్వతగిరి/సంగెం : విద్యార్థి దశలో ఆరోగ్యం కీలకమని వైద్యాధికారులు నేహా ఫాతిమా, ఉదయ్‌రాజ్, వంశీకృష్ణ తెలిపారు. వర్ధన్నపేట మైనార్టీ హాస్టల్‌లో, పర్వతగిరి పీఎంశ్రీ సాంఘిక సంక్షేమ గురుకుల స్కూల్/కళాశాలలో, సంగెం మండలంలో మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాలకు వారు హాజరై మాట్లాడారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. వ్యాయామం, యోగా సాధనను దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని తెలిపారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

● శాస్త్రవేత్తలు విజయభాస్కర్, నాగభూషణం

నర్సంపేట రూరల్ : పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు విజయభాస్కర్, నాగభూషణం, విశ్వతేజ తెలిపారు. నర్సంపేట మండలంలోని గురిజాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్‌తో నానో యూరియా పిచికారీపై మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. తొలుత గ్రామంలో రైతు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ పంట క్షేత్రాన్ని శాస్త్రవేత్తలు, అధికారులు సందర్శించారు. అనంతరం పత్తి, మెట్ట వరి సాగును సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడారు. అధిక మోతాదులో యూరియా వాడకం మంచిది కాదన్నారు. పంటలను చీడపీడలు మరింతగా ఆశించే ప్రమాదం ఉందని చెప్పారు. వాతావరణం కలుషితమవుతుందని తెలిపారు. ఎకరానికి అరలీటర్ చొప్పున నానో యూరియా పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట సహాయ వ్యవసాయ సంచాలకుడు దామోదర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కృష్ణ కుమార్, ఏఈఓ మెండు అశోక్, తదితరులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

● మాజీ కౌన్సిలర్ తిరుమల సదానందం

నర్సంపేట : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం విమర్శించారు. పట్టణంలోని 1వ వార్డులో రోడ్లపై పడిన గుంతలను మున్సిపల్ ఏఈ సహకారంతో మంగళవారం సదానందం పూడ్చి వేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సైడ్ డ్రెయినేజీ నిర్మించి నెలలు గడచినా మట్టి పోయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో వార్డు అభివృద్ధికి రూ.1.80 కోట్లు కేటాయించగా కాంగ్రెస్ అధికారం చేపట్టి నెలలు గడచినా నిధులు ఖర్చు చేయలేని దుస్థితి నెలకొందన్నారు. వార్డులో రోడ్లన్నీ చిత్తడిగా మారాయని తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిల్వకుండా మరమ్మతులు చేయించాలని కోరారు.



గుంతలను పూడ్చి వేయిస్తున్న తిరుమల సదానందం